# ఎన్నికల ప్రచారం

'మా నాయకుడు ఉద్దండుడు!' అని అరిచాడు ఓ కార్యకర్త జెండా ఊపుతూ!

'ఆయనకే మీరు వోటు వేయండి!' నమస్కారం పెట్టాడు జనానికి.

ఎగస్పార్టీ వాడు ప్రక్కనే నుంచుని హేళనగా నవ్వాడు.

'ఉద్దండుడు అంటే అర్థం తెలుసా'

'ఆ.. మహా ఘటికుడు' అని అర్థం.

'అది కాదోయి! ఉద్దండుడు- అంటే ఉత్తి దండగ మనిషి అని అర్థం అన్నాడు ప్రత్యర్థి కార్యకర్త.

'మా నాయకుడికే ఓటేయండి . ఆయన దండుడు' అని అరిచాడు ప్రత్యర్థి కార్యకర్త.

'దండుడు- అంటే' అన్నారు జనం.

'నేరములు చేస్తే దండించేవాడు. న్యాయమూర్తి అంత గొప్ప వాడు' అని సమాధానం, బలపరిచేవారి నుంచి-

'కాదయ్యాబాబూ! దండుడు అంటే చందాలు దండుకు తినే వాడు' అని అర్థం- అని పకపక నవ్వాడు ఓ కార్యకర్త ప్రతిపక్షం నుంచి.

ఒకరి ఊరేగింపు మరొకర్ని దూసుకుంటూ పోయింది.

ఓ అభ్యర్థి వద్దకు ఓ గుంపు వచ్చింది.

ఆవారాల్లా, గుండాల్లా- అన్ని లక్షణాలు వారిలో కనిపిస్తున్నాయి.

'గురువుగారూ ! మీకోసం రెండు రోజుల్నించి గాలిస్తున్నాం' మీకు సేవ చేద్దామని !

అభ్యర్థి నవ్వాడు.

'చూడండి- మా వెంకటాపురంలో ఓట్లన్నీ మీకే' అన్నారు.

'మీ పోటీ అభ్యర్థి' లేడండీ! ఉత్తి పిసినారి, మీరు ధర్మాత్ములు' అని పొడిగారు వారు.

'సరే ! మీరు ప్రచారం చేయండి- డబ్బు తరువాత చూద్దాం' అన్నాడు ఆ ముసలి నాయకుడు.

'అది కాదు సార్ ! మన కుర్రాళ్ళు లేరూ ! వాళ్ళకి ఏదో తినిపించాలిగా ! అప్పుడే ఉత్సాహంగా పనిచేస్తారు' అని మందస్మితం చేశాడు ఓ నడివయస్సు కార్యకర్త.

'ఎంతేమిటి !' అన్నాడు అభ్యర్థి నెమ్మదిగా ఒకడి చెవిలో'

'ఓ పదివేలు చాలు- యీ రోజుకి' అన్నాడు ఆ పెద్దమనిషి'.

అభ్యర్థి బిక్కమొహం పెట్టాడు.

'సరే నడవండి ఊరేగింపులో అన్నాడు అభ్యర్థి- తప్పనిసరిగా.

'జై వెంకయ్యగారూ ! జిందాబాద్'

నినాదాలు మిన్నుముట్టేయి-

ఊరేగింపు అయిపోయాక, ఆ అభ్యర్థి తిరుగు ప్రయాణంలో ఆ రోడువెంట వస్తూంటే, ఆ గుంపువారే 'జై పుల్లయ్యగారూ ! జిందాబాద్' అని అరుస్తూ వీధుల్లో ఊరేగింపుగా పోతున్నారు.

కార్యకర్తలు కొద్దిమందే- అందరికీ పనిచేసేది వారే ! ఓట్లు ప్రజలివి- ప్రచారంపేర నిధులు వీరివి అని ఏడ్చాడు అభ్యర్థి.

'అయ్యా మన గురువుగారు ఏంచేస్తున్నారు'

'అలసిపోయారయ్యా! పాదయాత్రలు చేసిచేసి'

'పాదాలు ఒత్తడానికి నేను వచ్చాను కదా సార్' గురువుగారికి చెప్పండి.

'అలసిపోయి, నిద్రలో వున్నారయ్యా' అన్నాడు ఓ అంతరంగిక కార్యకర్త.

'అవును నిద్రలో పగటి కలలు వచ్చే రోజులు ఇవి- ఎంఎల్ఏగా, మంత్రిగా ఢిల్లీ వెళ్ళినట్లు, రాష్ట్రపతిని కలిసినట్లు, ఢిల్లీలో అధికారం పొందినట్లు ఒకటే కలలు- చిరునవ్వులు- ఆనందమానందమాయేనే- మా పిచ్చయ్య యంయల్ఏ- ఆయేనే- అందరూ స్వాగత గానం- కలల్లో-

ఓ యింటి యజమాని ఏడుపు మొహం పెట్టుకు కూర్చున్నాడు.

'ఏం బాబుగారు- అలా వున్నారే'

'ఏముందయ్యా! ఎలక్షన్లలో మనకు ఆదాయం లేదు- మా గోడలు అద్దెకిద్దామనుకున్నా, కాని గోడలమీద రాయరాదు అని రూలు వచ్చిందట. ఎవడయ్యా ఆ అధికారి! తాను తినడూ! ఒకళ్లని తిననీయడూ! కాలం మారిపోయింది గురూ' అని మరోసారి ఏడ్పురాగం తీశాడు యజమాని.

'ఎలా వుంది సార్! మీ ఎన్నికల ప్రచారం' అన్నాడు ఓ విలేకరి

'అంతా బాగుందోయ్! వోట్లన్నీ మనవే! మనదే విజయం' అన్నాడు ఓ పార్టీ అభ్యర్థి.

మరో పార్టీ అభ్యర్థి అన్నాడు.

'ఆ పార్టీ వాడి ఓటమే నా లక్ష్యం' ప్రజల్లారా! వాడు ఎంతో తినేశాడు! పదవిలో వుండి యిన్నాళ్ళూ! అన్నాడు.

మీరు పదవిలోకి వస్తే మీరు తింటారాసార్! అన్నాడు ఆ విలేకరి.

'ఛ! తింటాను అన్న పదం బాగులేదయ్యా! గౌరవంగా 'భక్షిస్తాను' అంటే బాగుంటుంది.

'మనిషి తింటాడు సార్ ! రాక్షసులు భక్షిస్తారు సార్' అన్నాడు ఆ విలేకరి.

'బాబూ ! నువ్వు అంటే అన్నావు కాని అలా పత్రికల్లో మాత్రం వ్రాయకు అని' ప్రాధేయపడ్డాడు ఆ అభ్యర్థి.

'మా అభ్యర్థికే మీ ఓటు" అని రాయమంటే ఇదేమిటయ్యా "మా అభ్యర్థికే మీ పోటు"అని రాశావు- ఓ అభ్యర్థి బ్యానరు చూసి తలపట్టుకుని చతికిలపడ్డాడు.

ఇదేమిటయ్యా నా బొమ్మ యిలా చంటి పిల్లాడిలా వేశావు' అని ఓ అభ్యర్థి గోల పెట్టాడు రోడ్డుమీద హోర్డింగు చూసి-

'అది కాదు సార్ ! బాలలు దైవ స్వరూపులు కదా ! అందువల్ల మీ బొమ్మ బాలరూపంలో వేశాను. పెద్ద బొమ్మ వేయకూడదట రూల్సు ఒప్పుకోవు' అన్నాడు ఆ చిత్రకారుడు వెకిలిగా నవ్వుతూ !

'నా ప్రత్యర్థి మూర్ఖుడు' అని ఓ నాయకుడు ఉవాచ.

'నా ప్రత్యర్థి ఉత్త వెధవ మూర్ఖుడు' అని ఎదుటి పార్టీవాడి చమత్కారం.

ఊరంతా ఎన్నికల తిట్ల ఉపన్యాసాలతో కాలుష్యం నిండిపోయిందని కాలుష్య నివారణ అధికారి గోలపెట్టాడు ఓ చోట!

'ప్రతీవాడూ అందలమెక్కాలనే ఇదంతా ఎన్నికల ప్రచారమేరా బాబూ' అనుకున్నారు ఓటేయని జనం.

• •